లక్షలు వెచ్చించారు.. లక్ష్యాన్ని నీరుగార్చారు


మద్యం బాటిళ్లు, చెత్తా చెదారంతో దర్శనమిస్తున్న ఆర్టీసీ బస్టాండ్ భవనం


బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో మూడురోడ్ల కూడలిలో బస్సుల కోసం వేచివున్న మహిళలు

మందుబాబుల అడ్డాగా లక్కిరెడ్డిపల్లె ఆర్టీసీ బస్టాండ్

- మూడు రోడ్ల కూడలిలోనే బస్సుల స్టాపింగ్
- గత ప్రభుత్వంలో ప్రయాణికుల కోసం రూ.45 లక్షలతో బస్టాండ్ అభివృద్ధి
- అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న ప్రయాణికులు


లక్కిరెడ్డిపల్లి ఆర్టీసీ బస్టాండు ఆకతాయిలు తాగి పడేసిన మద్యం సీసాలు

లక్కిరెడ్డిపల్లి : ఆర్టీసీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో లక్కిరెడ్డిపల్లి ఆర్టీసీ బస్టాండు తీరు మారలేదు. ఆకతాయిలకు అడ్డాగా మారడమేకాక మద్యం బార్‌ను తలపించేలా ఆర్టీసీ బస్టాండ్‌ను మార్చేశారు మందుబాబులు. బస్టాండ్ ప్రాంగణంతోపాటు బిల్డింగ్ మొత్తం కూడా బీర్ సీసాలు, మద్యం బాటిళ్లు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. 1987లో మాజీ మంత్రివర్యులు, స్వర్గీయ కీ.శే.లు ఆర్.రాజగోపాల్ రెడ్డి ప్రయాణికుల సౌకర్యార్థం నూతన ఆర్టీసీ బస్టాండ్‌కు అప్పటి అధికారులతో కలిసి భూమిపూజ చేశారు. వేంపల్లి మార్గంలో ఎకరా పైబడి స్థలాన్ని కేటాయించి బస్టాండ్ నూతన భవనానికి నిధులు మంజూరు చేయించి అనతికాలంలోనే భవనాన్ని పూర్తిచేసి స్థానిక ఎంపీ సాయిప్రతాప్‌తో ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు సిబ్బందితో కలిసి 1993 ఫిబ్రవరి మాసంలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి కొంతకాలం వరకు ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌కు రాకపోకలు వచ్చేలా చూశారు. బస్సు సర్వీసులు బస్టాండ్ నూతన బిల్డింగ్ భవనంలోకి రాకపోకలు నిలిచిపోవడంతో ఆ భవనాన్ని ఓ ప్రైవేటు పాఠశాలలకు ఆర్టీసీ అధికారులు లీజుకు అప్పజెప్పారు. లక్కిరెడ్డిపల్లి మూడు రోడ్ల కూడలిలో ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థి, ప్రజాసంఘాల ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఉద్యమాలు చేపట్టడంతో తిరిగి కొన్ని రోజులు ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆర్టీసీ సంస్థకు నష్టాలు వస్తున్నాయనే నెపంతో మళ్లీ బస్టాండ్‌ను కొన్ని సంవత్సరాలపాటు మరోసారి ప్రైవేటు పాఠశాలలకు లీజుకు అప్పగించారు. కొన్ని సంఘటనల వల్ల సదరు ప్రైవేటు పాఠశాల మూతపడిపోవడంతో ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా పాడైపోయి అధ్వాన స్థితికి చేరుకునే పరిస్థితికి వచ్చింది. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ చీఫ్ విప్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చొరవతో ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మతులు చేయడానికి రూ.45 లక్షలు నిధులను మంజూరు చేయించారు. కాంట్రాక్టర్ ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మతులను సకాలంలో పూర్తి చేశారు. ఇంతలో 2024 సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రారంభానికి నోచుకోక ఇప్పటికీ ప్రారంభించకపోవడంతో లక్కిరెడ్డిపల్లి ఆర్టీసీ బస్టాండ్ మందుబాబులకు అడ్డాగా మారింది.

మూడు రోడ్ల కూడలి వద్దే పడిగాపులు

ప్రస్తుతం రాయచోటి నుండి లక్కిరెడ్డిపల్లి, వేంపల్లి మీదుగా చాగలమర్రి వరకు నేషనల్ హైవే పనులు జరుగుతుండటంతో ప్రయాణం మరింత సులభతరం కావడంతో లక్కిరెడ్డిపల్లి నుంచి రామాపురం, రాయచోటి, గాలివీడు, కడప, వేంపల్లి, పులివెందులకు వెళ్లాలంటే లక్కిరెడ్డిపల్లి ప్రధాన కూడలి కావడంతో ప్రయాణికులు మూడురోడ్ల కూడలిలో గంటల కొద్దీ బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ ధనం మరోమారు వృథా కాకుండా లక్కిరెడ్డిపల్లి ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చి ఆర్టీసీ ఉన్నతాధికారులు చొరవచూపాలని పలువురు మండల వాసులు కోరుతున్నారు. ఈ విషయమై పలుమార్లు పత్రికల్లో ఆర్టీసీ బస్టాండ్‌పై కథనాలు వచ్చినా ఆర్టీసీ ఉన్నతాధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో లక్కిరెడ్డిపల్లి ఆర్టీసీ బస్టాండ్ మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారిపోయి ప్రభుత్వ ఖజానా కాస్త నిర్వీర్యం అయ్యే పరిస్థితి నెలకొని ఉంది. ఆర్టీసీ బస్టాండ్‌ను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఏది ఏమైనా ఉన్నతాధికారుల్లో చలనం వచ్చి ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చొరవ చూపాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండు దూరం ఉన్నందున..

మూడురోడ్ల కూడలి నుంచి బస్టాండ్ దూరం ఉన్నందున ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌కు రావడానికి మొగ్గు చూపడం లేదు. దీంతో ఆర్టీసీ సర్వీసులు బస్టాండ్ వైపు నడపలేకపోతున్నాం. మూడురోడ్ల కూడలిలో అవసరమైన నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండటంతో అక్కడే స్టాపింగ్‌కు మొగ్గు చూపుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయి. రాబోయే రోజుల్లో నేషనల్ హైవే కారణంగా మూడురోడ్ల కూడలిలో స్టాపింగ్‌కు అవకాశం లేనిపక్షంలో ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రయాణికులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా బస్టాండ్‌ను పునరుద్ధరించడానికి సిబ్బందితో కలిసి అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తాం.

- రాము, ఆర్టీసీ ఆర్ఎం, ఇన్‌చార్జ్, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

పాఠశాలలో పారిశుద్ధ్య పనులు



ఓబులవారిపల్లె : అనంతరాజుపేట ప్రాథమిక పాఠశాల నందు మంగళవారం ఎంపీటీసీ బండారు మల్లికార్జున పారిశుద్ధ్యపనులను చేయించారు. పాఠశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఇబ్బందికరంగా మారడంతో ఎంపీటీసీ స్పందించి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి పారిశుద్ధ్య పనులను చేయించారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లి గ్రామానికి చెందిన వంకన శ్రీకాంత్ రెడ్డికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ రూ.3,88,101లు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్కా వరలక్ష్మి, పున్నాటి వాసుదేవరెడ్డి, సిందూ సుదర్శన్ రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ


పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

రైల్వేకోడూరు : మండల కేంద్రంలోని తులసీ విద్యాసంస్థల విద్యాసంస్థల అధినేత మేకపాటి తులసీ కుమారుడు భరద్వాజ్, లాస్యలను పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ఆశీర్వదించారు. ఇటీవల వివాహం జరగడంతో కోడూరులోని వారి నివాసానికి ఎమ్మెల్సీ చేరుకుని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి దీవించారు. కార్యక్రమంలో జెడ్పీ విద్యాసంస్థల చైర్మన్ వెంకటరెడ్డి, మక్కా హైస్కూల్ విద్యాసంస్థల చైర్మన్ రాజశేఖర్, యువరాజ్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు

వీరబల్లి : మండలంలోని పెద్దమాదిగపల్లిలో ఏడు రోజులుగా జరుగుతున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు మంగళవారంతో ముగిసింది. క్యాంపులో భాగంగా 50 మంది పైగా విద్యార్థులు పాల్గొని ఎంపీపీ స్కూల్ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ అధికారులు ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏడురోజుల క్యాంపులో వాలంటీర్లు చేసిన సేవను వీరబల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు భాస్కర్, జి.రఘురామయ్యలు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు వల్ల సేవ చేయాలనే తత్వాన్ని ఏర్పరుచుకొని నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. అనంతరం వాలంటీర్లను అభినందించి ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శాంసన్ రెడ్డి, రాధాకృష్ణ, రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక


జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థినులు

గాలివీడు : ఎస్జీఎఫ్ఐ పోటీల్లో వాలీబాల్ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు గౌతమ్ పాఠశాల విద్యార్థినులు లాస్య ప్రియ, కావ్యశ్రీ, ఆల్ఫిజా ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం సైజు థామస్, షింటో ఇమ్మానుయేల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నమండెంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వాలీబాల్ అండర్-19 విభాగ పోటీల్లో తమ విద్యార్థినులు ప్రతిభ కనబరచి జిల్లాస్థాయికి ఎంపికవ్వడం పాఠశాలకు గర్వకారణమన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. అలానే వ్యాయామ ఉపాధ్యాయుడు పవన్ కుమార్ నాయక్ విద్యార్థినులను అభినందించారు.

బదిలీ టీచర్‌కు సన్మానం


టీచర్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ, గ్రామస్తులు

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ రెడ్డిమళ్లువారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెళ్లిన కృష్ణయ్యకు గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల బోధనలో, ప్రభుత్వ కార్యక్రమాల అమలు చేయడంలో ఆయన ఎంతో అంకితభావంతో పనిచేస్తాడని కొనియాడారు. అనంతరం కృష్ణయ్యను ఘనంగా దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.

నేడు మండల సమావేశం

పుల్లంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. మండలాధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆమె కోరారు.

ఎస్ఈసీ మెంబర్‌కు సన్మానం


విజయభాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరబల్లి : వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డికి మంగళవారం ఘన సన్మానం చేశారు.

వీరబల్లి మండల కేంద్రంలో ఆయన నివాసంలో మండల వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు శాలువాలతో, పూలదండలతో విజయభాస్కర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆయనతోపాటు రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షులు రాజేంద్రనాథ్ రెడ్డిని, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరనాగిరెడ్డిలను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దాటిగుట్ల అమర్నాథ రెడ్డి, అన్నమయ్య జిల్లా సోషల్ మీడియా ప్రెసిడెంటు నరేష్ స్వామి, నియోజకవర్గ ఐటీ వింగ్ ప్రెసిడెంట్, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి, వైఎస్సార్‌సీపీ వీరబల్లి మండల యూత్ ప్రెసిడెంటు షాహిర్ బాషా, మాజీ సర్పంచ్ రమణ, నాయకులు గౌస్ పీర్, ఈశ్వరయ్య, రాచరాయుడు, చంద్ర గౌడ్, మసూద్ బాషా పాల్గొన్నారు.

పంచాయతీ విభజనకు వ్యతిరేకంగా ఓటు


గ్రామసభలో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ యాస్మిన్

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామ సచివాలయంలో పంచాయతీ విభజనకు గ్రామ సర్పంచ్ పోలుబోయన లక్ష్మీదేవి అధ్యక్షతన మంగళవారం సమావేశం ఏర్పాటు చేసినట్టు ఈఓపీఆర్‌డీ మెహతాజ్ యాస్మిన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 23వ తేదీన రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు టక్కోలు గ్రామం ఎస్సీ కాలనీ నివాసుడైన బాలసుబ్రమణ్యం అనే వ్యక్తి టక్కోలు, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ కలిసి ఒక గ్రామ పంచాయతీ గాను, ఖాజీపల్లె, డేగనవాండ్లపల్లి, పాత టక్కోలు గ్రామాలు కలిసి మరో గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఫిర్యాదు చేశారన్నారు. పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాలతో, కడప డీపీఓ ఉత్తర్వుల మేరకు ప్రజా ఆమోదానికి గ్రామసభ ఏర్పాటు చేయగా టక్కోలు ఒకే గ్రామ పంచాయతీగా కలిసి ఉండాలని 63 మంది, విభజన జరగాలని ముగ్గురు సంతకాలు చేసినట్టు చెప్పారు. ప్రజల అభిప్రాయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో పంపిస్తామన్నారు. గ్రామసభకు ఎస్ఐ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పంచాయతీ కార్యదర్శి రామలింగారెడ్డి, ఎంపీటీసీ సుబ్బమ్మ, స్థానికులు నీలకంఠారెడ్డి, నాగమునిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సాంబశివాఎడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.

డీఆర్ఎం దృష్టికి నందలూరు రైల్వే సమస్యలు


డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న మురళి

నందలూరు : నందలూరు రైల్వే కేంద్రంలోని ముఖ్యమైన సమస్యలను స్థానిక రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ మెంబర్ రాచూరి మురళి మంగళవారం గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎస్.మనోజ్‌ని కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ కోవిడ్ ముందు నిలబడే ప్రతి ఒక్క రైలు నిలుపుదల చేయాల్సిందిగా, రైల్వేస్టేషన్ వద్ద నిర్మిస్తున్నటువంటి నూతన అండర్ సబ్‌వేలో పాదచారులకు ఫుట్‌పాత్ నిర్మించలేదు కనుక దానికి పరిష్కారం చూపాలని కోరారు. రైల్వే కమ్యూనిటీ హాల్ నందు ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో శుభ కార్యాలు జరుగుతున్నాయని కానీ సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వే కమ్యూనిటీ హాల్‌ని ఎయిర్ కండీషన్ చేసి సౌకర్యాలు కల్పించాలన్నారు. అయ్యప్ప మాలధారుల కోసం స్పెషల్ ట్రైన్లు నందలూరులో నిలుపుదల చేయాల్సిందిగా విన్నవించారు. నందలూరులోని వందల ఎకరాల రైల్వే స్థలాన్ని రైల్వే అవసరాలకు ఉపయోగించుకోవాల్సిందిగా, మండలంలోని చిన్న పిల్లలు, యువతకు రైల్వే క్రీడా మైదానాన్ని నిర్మించి దానిని అభివృద్ధి చేయాలని తెలిపారు. సమస్యలు విన్న అధికారులు అండర్ గ్రౌండ్ సబ్‌వే ఫుట్‌పాత్ కొరకు వెంటనే తగు చర్యలు చేపడతామని, శబరిమలై స్పెషల్ ట్రైన్స్ కల్పిస్తామని, రైల్వే కమ్యూనిటీ హాల్ ఆధునీకరణకు, క్రీడా మైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

అంతర్జాతీయ సదస్సులో ఏయూ విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ డాక్టర్ ఇ.సాయిబాబా రెడ్డి తదితరులు

రాజంపేట : పంజాబ్ రాష్ట్రం మొహాలిలోని ఛండీగడ్ ఇంజనీరింగ్ కాలేజీ సీజీసీ ల్యాండ్రన్‌లోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 6వ ఇంటర్‌నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్నోవేషన్ ఇన్ కమ్యూనికేషన్, కంప్యూటింగ్ అండ్ సైన్సెస్ అనే అంశంపై సెప్టెంబర్ 25వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్ వేదికగా నిర్వహించబడింది. ఈ సదస్సులో అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థులు టి.గురువర్ధన్, గణేష్, అనిత, పి.భవితలు ఎఫీషియెంట్ అండ్ లైట్ వెయిట్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ కాన్ఫిడెన్షియల్ మెడికల్ ఇమేజ్ డయాగ్నోసిస్ యూజింగ్ ఎడ్జ్ ఏఐ అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఈ పత్రానికి ఉత్తమ పత్రం అవార్డు లభించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా నిలిచింది. అనంతరం అన్నమాచార్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సర్ ఇ.సాయిబాబా రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జె.చిన్నబాబు, డాక్టర్ జి.తిరుమలయ్యలు విద్యార్థులను అభినందించారు.

దశాబ్దాలు గడుస్తున్నా దళితవాడల దశ మారలేదు


గ్రామంలోని సమస్యలపై స్థానికులతో కలిసి మాట్లాడుతున్న శ్రీనివాసులు

రామాపురం : స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ దళితవాడలు అభివృద్ధి చెందడం లేదంటే పాలకుల చిత్తశుద్ధి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధికారి మద్రి సుమిత్రలు వాపోయారు.

మంగళవారం సీపీఐ నాయకులు మండలంలోని గోపగుడిపల్లె గ్రామం అడపాల మాలపల్లె పర్యటించారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అడపాల మాలపల్లెలో దళితులు అధ్వాన పరిస్థితుల నడుమ జీవిస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా దళితవాడల పరిస్థితి ఏమాత్రం మారడం లేదన్నారు. గ్రామంలో 35 కుటుంబాలు నివసిస్తున్నా, ఇతర గ్రామాలతోపాటు మండల కేంద్రానికి వెళ్లేందుకు త్రోవ లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. అలానే వీధి లైట్లు కూడా లేకపోవడం అధికారుల అలసత్వం తెలుస్తోందని వాపోయారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దళితుల గ్రామానికి కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘ అధ్యక్షురాలు ప్రమీళ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో టమాటా, మామిడి అమ్మకాలు చేపట్టాలి

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటి మార్కెట్ యార్డులో టమాటా, మామిడి కాయల అమ్మకాలు చేపట్టడానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాయచోటి ప్రాంతంలో మామిడి కాయ మండీల సిండికేట్లను గండికొట్టడానికి నిరుపయోగంగా ఉన్న రాయచోటి మార్కెట్‌యార్డులో మామిడి కాయల కొనుగోలు, అమ్మకాలు చేపట్టాలని తెలిపారు. గుర్రంకొండ మార్కెట్‌యార్డులో టమాటా అమ్మకాల్లో వ్యాపారులు అక్రమ లబ్ధి పొందేందుకు ఏర్పాటు చేసుకొన్న జాక్‌పాట్ విధానాన్ని రైతుల డిమాండ్ మేరకు నిషేధించి న్యాయం చేయాలని కోరారు. రాయచోటి మార్కెట్ యార్డులో నూతనంగా టమాటా అమ్మకాలు, కొనుగోలు చేపట్టడంతో సమీప మండలాల రైతులు, ప్రజలు, వ్యాపారులకు సౌకర్యంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ విషయమై అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షులను కలిసిన అవ్వారు



రైల్వేకోడూరు : ఏపీఎన్‌జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్‌ను మంగళవారం తాడేపల్లిలో ఏపీ ఇంటర్మీడియట్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అవ్వారు శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పలు సమస్యలపై విద్యాసాగర్‌తో చర్చించారు. కార్యక్రమంలో తిరుపతి ఏపీఎన్‌జీఓల చైర్మన్ సురేష్ బాబు, వివిధ జిల్లాల ఏపీఎన్‌జీఓల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ విధానంపై డెమో


సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు

పెనగలూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండవరోజు ఆరోగ్యం - భద్రతపై విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సహజ బ్లెస్సీ, డాక్టర్ గంగాధర్, ఎన్ఎస్ఎస్ పీఓలు హేమలత, గౌసుద్దీన్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్ సీపీఆర్ విధానాన్ని వివరించగా, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు డెమో ద్వారా ప్రజలకు చేసి చూపారు. అలానే సీపీఆర్ ఉపయోగాలను తెలియజేశారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం


అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రవీంద్ర

సుండుపల్లె : ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. మంగళవారం సుండుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రధానోపాధ్యాయురాలు జక్రియ బేగం ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహనా కల్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ దేశ భవిష్యత్ ప్రణాళికలు రూపకల్పనలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. పిల్లలు పాఠశాల స్థాయి నుంచి నానాటికి పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై చక్కటి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. వివిధ యాప్‌ల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేటప్పుడు ఎవరికి ఓటీపీలు చెప్పకూడదని వాట్సాప్ లింకులను ఓపెన్ చేయరాదని అపరిచిత వ్యక్తులతో వాట్సాప్ చాటింగ్‌లు చేయరాదని పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్యానికి జీవ ఎరువులు వాడాలి

మదనపల్లె రూరల్ : నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే జీవన ఎరువుల వాడకం తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి కె.నవీన్ రెడ్డి అన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచనల మేరకు జీవన ఎరువుల ప్రాముఖ్యతపై కేవీకేలు, జిల్లా ఏరువాక కేంద్రాల ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా దండువారిపల్లెలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కె.మంజుల కో-ఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు జీవన ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. వ్యవసాయంలో అధిక రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంతో భూమిలో, ఉపరితలం పైనా పర్యావరణ కాలుష్యంతో పాటు రైతులకు పెట్టుబడి అధికమవుతోందన్నారు. భూమిలో రైతులకు మేలుచేసే సూక్ష్మంగ జీవులు తగ్గిపోతున్నాయన్నారు. మొక్కకు పోషకపదార్థాలు, హార్మోన్‌లు సమకూర్చే వీలులేకుండా పోతోందని చెప్పారు. జీవన ఎరువులు వాడటం వల్ల నేలలో మార్పులు జరిగి రైతుకు మేలు చేసే మిత్ర సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుతుందన్నారు. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడమే కాకుండా నేల నుంచి సంక్రమించే తెగుళ్లను కొంతమేర తగ్గించవచ్చన్నారు. నేల భౌతిక లక్షణాలు బాగుపడి భూసారం అభివృద్ధి చెందుతుందన్నారు. సేద్యవిభాగ శాస్త్రవేత్త సోమశేఖర్‌బాబు మాట్లాడుతూ జీవన ఎరువులు ఏ పంటకు ఎంత మోతాదులో, ఎలా వాడాలో తెలియజేశారు. విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.మాధురి మాట్లాడుతూ వన ఎరువుల వాడకం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని సూచించారు. జీవన ఎరువుల కొనుగోలుకు రైతులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి, కృషి విజ్ఞాన కేంద్రం కలికిరిని సంప్రదించాలన్నారు. కావాల్సిన రైతులు 80085 00320 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

చిన్నపిల్లలకు టపాసులు అమ్మితే చర్యలు


దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పెనగలూరు : దీపావళికి టపాసులు అంగళ్లు పెట్టేవారు చిన్నపిల్లలకు టపాసులు అమ్మితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అమరేశ్వరి అన్నారు. మంగళవారం దీపావళికి షాపులు పెట్టుకునేందుకు ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ టపాసులు దుకాణాలను హైస్కూల్‌లో గ్రౌండ్‌లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. టపాసుల దుకాణాల చుట్టుపక్కల ఎవరు పొగతాగకుండా చూసుకోవాలన్నారు. పొగ తాగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. అలాగే పోలీసులు, విద్యుత్ అధికారులు టపాసుల విక్రయదారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్, విద్యుత్ ఏఈ ఓబుల్ రెడ్డి, ఏఎస్ఐ రాముడు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు


మద్యం షాపులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ మహమ్మద్ అలీ

గాలివీడు : గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ మహమ్మద్ అలీ హెచ్చరించారు. మంగళవారం ఆయన నూలివీడు, గాలివీడులో మొత్తం 3 మద్యం షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను రూపొందించిందని చెప్పారు. మద్యం కొనుగోలుదారులు తప్పనిసరిగా బాటిల్‌ను సరిచూసుకోవాలని, షాపులో డ్యూటీలో ఉన్న వ్యక్తి ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసి ఇవ్వాలని సూచించారు. అంతేకాక, వారి మొబైల్ ఎప్పుడూ ఆన్‌లో ఉంచుకోవాలని తెలియజేశారు. అనుమానం ఉంటే వెంటనే 14405 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్పోర్ట్స్ అధికారికి సన్మానం


డీఎస్డీఓను సన్మానిస్తున్న క్రీడాకారులు

రాయచోటి టౌన్ : జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి (డీఎస్డీఓ) గా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ను అన్నమయ్య జిల్లా హాకీ కార్యదర్శి ఇడగొట్టు నాగేశ్వరావు, క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన్ను కలసి సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్డీఓ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటితో పాటు అన్ని ప్రాంతలలోని విద్యార్థులకు క్రీడలపై మక్కువ పెంచి వారిలోని ప్రతిభ వెలికి తీసే ప్రయత్నం చేస్తానన్నారు. ప్రధానంగా రాయచోటిలో హాకీ క్రీడపై విద్యార్థుల మక్కువ ఉందని దీనిపై దృష్టి సారిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాజు విద్యాసంస్థల హాకీ కోచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.